# మార్కెట్లో ర్యాలీ కొనసాగొచ్చు

**సమీక్ష:** అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ధోరణి దేశీయ మార్కెట్లలోనూ కనిపించడంతో గతవారం సెన్సెక్స్ 223 పాయింట్ల లాభాన్ని పొందింది. వారం ప్రారంభంలో ప్రపంచ మార్కెట్ల బలహీనత నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో మంగళవారానికి మార్కెట్ 8 వారాల కనిష్ఠ స్థాయి 17820ను తాకింది. ఆ తర్వాత అంచనాల కంటే మెరుగ్గా నమోదైన దేశీయోత్పత్తి గణాంకాలు మార్కెట్‌ను లాభాల బాట పట్టించేలా చేశాయి. అమెరికా, చైనా దేశాల తయారీ గణాంకాలు ఆ జోరును కొనసాగేలా చేశాయి. సెన్సెక్స్‌ను 18356 పాయింట్ల గరిష్ఠ స్థాయికి దూసుకెళ్లేలా చేశాయి. చివరకు 18221 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు:** మార్కెట్లో ఎఫ్ఐఐలు తమ ధోరణిని కొనసాగిస్తూ రూ.1452.90 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. మ్యూచువల్ ఫండ్లు రూ.97.80 కోట్ల నికర విక్రయాలు చేశారు.

**రంగాల వారీగా:** స్థిరాస్తి, ఎఫ్ఎమ్‌సీజీ, వాహన షేర్లు లాభాలను పండించాయి. చమురు-సహజవాయువు షేర్లు అధికంగా నష్టపోయాయి. యంత్ర పరికరాలు, విద్యుత్ సూచీలు అధిక స్థాయిల వద్ద విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

శుక్రవారం లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:3గా నమోదు కావడం చూస్తే ఎంపిక చేసిన షేర్లలో లావేదేవీలు జరిగాయని తెలుస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** గతవారం సెన్సెక్స్ ఒక దశలో 60 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) అయిన 17828 కంటే దిగువకు వచ్చి 8 వారాల కనిష్ఠ స్థాయి 17820కు చేరింది. ఆ తర్వాత అది ఆ స్థాయి వద్దే మద్దతు పొంది అధిక స్థాయిలకు దూసుకెళ్లింది. స్వల్పకాలంలోనూ మార్కెట్‌కు 60 డీఎమ్ఏ స్థాయి(ప్రస్తుతం 17938 వద్ద ఉంది)ల వద్ద బలమైన మద్దతు కొనసాగుతుంది. గత వారంలోనూ మార్కెట్ స్వల్పకాల ర్యాలీలోకి ప్రవేశించి 18238 కంటే పైన ముగిసింది. ఒక దశలో 18356 స్థాయికీ పరుగులు తీసింది. గత ఏడాది కాలంగా మార్కెట్ 3000 పాయింట్ల శ్రేణిలోనే కదలాడుతూ వచ్చింది. అయితే నవంబరు 2009లో 15330 స్థాయి నుంచి ఈ ఏడాది ఆగస్టున 18475న గరిష్ఠ స్థాయికి పెరుగుతూ వచ్చింది. ఈ వ్యవధిలో మార్కెట్లో ఎంపిక చేసిన షేర్లలో కదలికలు కనిపించాయి. స్వల్ప, మధ్య కాలాల్లో ఈ ధోరణి కొనసాగవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** అంతర్జాతీయ మార్కెట్లు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ధోరణి మార్కెట్ కదలికలను దిశా నిర్దేశం చేయొచ్చు. ఆహార ద్రవ్యోల్బణం, ఐఐపీ గణాంకాలు సెంటిమెంటుపై ప్రభావం చూపొచ్చు.




**తక్షణ మద్దతు స్థాయిలు:** 18048, 17938, 17820; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18402, 18500, 18636

**ఏదైనా నిరోధాన్ని ఎదుర్కొనే ముందు మార్కెట్ అధికస్థాయిలకు పయనించవచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*